సాక్షి పెద్దపల్లి

బుధవారం । 14 । జూన్ । 2023



ఆత్మవిశ్వాసంతో గెలుపు

జ్యోతినగర్: ఆత్మవిశ్వాసంతో గెలుపు సాధ్యమని పర్వతాలను అధిరోహించిన మాలావత్ పూర్ణ అన్నారు. ఎన్టీపీసీలోని జ్యోతిభవన్‌కు చేరుకున్న ఆమెకు జెమ్ శిక్షణా శిబిరం ప్రతినిధులు స్వాగతం పలికారు.



పత్తి క్వింటాల్‌కు ధర రూ.6,985

పెద్దపల్లిరూరల్: వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు మంగళవారం రూ.6,985 ధర పలికిందని మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి సతీశ్ తెలిపారు. కనిష్టంగా రూ.6,055, సరాసరి రూ.6,725గా నమోదైందని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
41.0/31.0

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

- జిల్లాలో రెండు కేంద్రాలు
- 666 మంది విద్యార్థులు

సుల్తానాబాద్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని డీఈవో మాధవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాకేంద్రంలోని బాలుర, బాలికల పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తామని, 666 మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. బాలుర హైస్కూల్లో 306 మంది, బాలికల పాఠశాలలో 360 మంది పరీక్షలు రాయనున్నారు. ఈనెల 14 నుంచి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. 14న తెలుగు, 15న ఇంగ్లిష్, 16న హిందీ, 17న గణితం, 19న సామాన్య శాస్త్రం, 20న సాంఘీకశాస్త్రం ఉంటాయని ఎగ్జామ్ ఇన్‌చార్జి రాంరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వివరించారు.

22న పెద్దపల్లిలో బీజేపీ బహిరంగసభ

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న జిల్లాకేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి దాడి సంతోష్, రాజేశ్వర్‌రావు తెలిపారు. సభకు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ హాజరవుతున్నారని వివరించారు.

నేడు వైద్య ఆరోగ్య దినోత్సవం


పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లాకేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రిలో ఉదయం 9గంటలకు పండ్ల పంపిణీ, బ్లడ్ డొనేషన్ క్యాంపు, నందనగార్డెన్‌లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. గోదావరిఖనిలోని ప్రభుత్వాసుపత్రిలో పండ్ల పంపిణీ అనంతరం లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, అనంతరం ఆసుపత్రి ఆవరణలోనే కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

రైతుల శ్రమను దోచుకుంటున్నారు



పెద్దపల్లిరూరల్: కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామనుకుంటున్న రైతుల శ్రమను పాలకులు, అధికారులు, మిల్లర్లు కలిసి దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, బీజేపీ నాయకుడు మీస అర్జున్‌రావుతో కలిసి జిల్లాకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మిల్లర్ల ప్రలోభాలకు లొంగి వారు చెప్పినట్లే అధికారులు నడుచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు ఇసుక, మట్టి, కంకర వంటి సహజసంపదలను దోచుకుంటున్నారని అన్నారు. రైతులు ఆందోళనతో ఉంటే పాలకులు సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. మున్సిపాలిటీలోని సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. మైనార్టీ మోర్చా జిల్లా నాయకుడు ఫహీం ఆధ్వర్యంలో పార్టీలో చేరినవారికి కండువాకప్పి ఆహ్వానించారు. నాయకులు ఠాకూర్ రాంసింగ్, కొంతం శ్రీనివాసరెడ్డి, పిన్నింటి రాజు, శ్రీనివాసరావు, ఆదికేశవరావు తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో




పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

కమాన్‌పూర్: రామగిరి మండలం లద్నాపూర్ పోలింగ్ కేంద్రాలను మంథని ఆర్డీవో వీరబ్రహ్మాచారి మంగళవారం పరిశీలించారు. లద్నాపూర్‌లోని 227, 288 పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలో ఉండడం.. అది శిథిలావస్థకు చేరడంతో ప్రత్యామ్నాయంగా గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించారు. తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ ఉన్నారు.

విత్తన మాయగాళ్లొస్తున్నారు..!

- రైతులను బురిడీ కొట్టించేందుకు యత్నాలు
- అధికారులు తనిఖీలు చేస్తున్నా పట్టని వైనం
- అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులు
- వ్యవసాయశాఖ మరింత అప్రమత్తతే కీలకం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మారెడ్డి స్థానిక ఆగ్రోస్ కేంద్రంలో ఎరువులు కొనుగోలు చేసిన రశీదు. సంబంధిత ఎరువుల బస్తాపై ఎంఆర్‌పీ రూ.1,075 ఉండగా.. డీలర్ రూ.1,700 చొప్పన విక్రయించాడు. సదరు రైతు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయటంతో తనిఖీ చేసి ఆ డీలర్ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు.



పెద్దపల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సాక్షి, పెద్దపల్లి: వానాకాలం సాగు వస్తుందంటే చాలు విత్తన మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృత తనిఖీలు చేపడుతున్నా వ్యాపారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో తిరుగుతూ అమాయక రైతులకు అంటగడుతున్నారు. ఏరువాక పౌర్ణమి ఆరంభంతో అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఇదే సమయంలో రైతుల అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని నకిలీ (నాసి రకం) విత్తనాలు, పురుగుమందులు మార్కెట్లోకి ముంచెత్తనున్నాయి. ఇటీవల జిల్లా సరిహద్దు వరంగల్ జిల్లాలో సుమారు రూ.2.11కోట్ల నకిలీ విత్తనాలను పోలీసులు తనిఖీల్లో గుర్తించారు. గతంలో సైతం మంథని నియోజకవర్గం మల్హర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి, గాధంపల్లికి చెందిన వ్యాపారి, నాగారానికి చెందిన మరో వ్యాపారి, పెద్దపల్లికి చెందిన ఇంకో వ్యాపారి నకిలీ విత్తనాల రాకెట్‌లో దొరికారు. జిల్లాలో కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఇతర రాష్ట్రాల నుంచి విడి విత్తనాలు తెప్పిస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచే జిల్లాలో నకిలీ బెడద తొలగాలంటే వ్యవసాయ, పోలీసు శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

మహారాష్ట్ర నుంచి..

పత్తి విత్తనాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను 'క్యాష్' చేసుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన వారితో స్థానికంగా కొంతమంది అక్రమ వ్యాపారులు ముఠాగా ఏర్పడి విడి విత్తనాలను తెప్పిస్తున్నారు. వాటిని ఈ ప్రాంతంలోని అన్నదాతలను ఆకర్షించేలా ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో విక్రయాలు చేపడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం నిషేధించిన బీటీ–3 పేరిట అధిక దిగుబడి వచ్చే కొత్తరకం విత్తనాలంటూ కిలోల లెక్కన లూజ్‌గా అమ్ముతున్నారు. చేనులో గడ్డి మందు పిచికారీ చేసినా ఈ మొక్కలు తట్టుకుంటాయని, ఇవి అధీకృత డీలర్ల వద్ద లభించబోవని మాయమాటలు చెప్పి రైతులకు విక్రయిస్తున్నారు.

“ చర్యలు తీసుకుంటాం

జిల్లావ్యాప్తంగా పురుగుమందులు, ఎరువుల విత్తనాల దుకాణాల్లో తరుచూ టాస్క్‌ఫోర్స్ తనిఖీ బృందాలతో దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. ఎలాంటి నకిలీలు, కల్తీలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. విత్తనాల కృత్రిమకొరత సృష్టించడం, చీకటి వ్యాపారం చేయడం, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– ఆదిరెడ్డి, డీఏవో

డీలర్ల లైసెన్స్ సస్పెన్షన్

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం లైసెన్స్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు ఏడీఏ శ్రీనాథ్ తెలిపారు. రైతు సేవా కేంద్రంలో పొటాష్ 50 కిలోల బస్తాకు రూ.1,075 ఎమ్మార్పీ ఉండగా.. రైతులకు రూ.1,700 బస్తా చొప్పున విక్రయించినట్లు రైతు పత్తి లక్ష్మారెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించి అధిక ధరలకు విక్రయించినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో సదరు డీలర్ లైసెన్స్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు ఏడీఏ తెలిపారు. అలాగే రికార్డులు సరిగా నమోదు చేయని పెగడపల్లి గ్రామానికి చెందిన సాయికృష్ణ ఫెర్టిలైజర్ షాప్ డీలర్ లైసెన్స్‌ను 21 రోజులు సస్పెండ్ చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ➔ గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరకు ఇస్తామని ఎవరైనా చెబితే నమ్మకూడదు
- ➔ అనుమతి పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- ➔ పంట కాలం పూర్తయ్యేవరకూ బిల్లులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.
- ➔ విత్తనాలను ఇంటివద్ద నాటి మొలక శాతాన్ని పరీక్షించాకే పొలంలో విత్తితే ఫలితం ఉంటుంది. మొలకశాతం తక్కువ ఉంటే, దుకాణదారుడికి వాపస్ చేసి, మరోరకం తీసుకోవచ్చు. ఒకవేళ వారు తీసుకోకుంటే అధికారులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందవచ్చు.
- ➔ లూజ్, సీల్ తీసి ఉన్న సంచులు, చిరిగి ఉన్న ప్యాకెట్లలోనివి, మూత తీసి ఉన్న పురుగు మందు డబ్బాలు కొనుగోలు చేయవద్దు.
- ➔ విత్తనాలు కొనుగోలు చేసే ముందు బ్యాచ్, లాట్ సంఖ్య, తయారీ, గడువు తేదీ, సంబంధిత కంపెనీ హోలోగ్రాం ఉన్నాయా..? లేదా..? చూసుకోవాలి.

భగభగలే..

- మృగశిరకార్తె వచ్చినా తగ్గని వేడి
- రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికం



సాక్షి, పెద్దపల్లి: ఎండల తీవ్రత తగ్గడంలేదు. సాధారణంగా జూన్ మాసం మొదలైతే చాలు ఎండలు తగ్గుముఖం పట్టి.. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయి. జూన్ మొదటి వారం దాటితే వర్షాలు కూడా కురుస్తాయి. కానీ ఈయేడు రోహిణి కార్తె వెళ్లి.. మృగశిర కార్తె వచ్చినా ఎండలు మండిపోతున్నాయి. ఎండ తీవ్రత తగ్గకపోగా.. వడగాల్పులు అధికంగా వీస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఎండతీవ్రత మండిపోయింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఈసాలతక్కళ్లపల్లిలో 45 డిగ్రీలుగా నమోదైంది. సాధారణంగా మధ్యాహ్నం వరకు కాస్త ఎండ.. ఆ తర్వాత చల్లబడి అక్కడక్కడా జల్లులు కురవడం మృగశిరలో అనవాయితీ. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ ఎండల తీవ్రత కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాల ఆలస్యంతోనే ఈ స్థాయిలో ఎండలు, వేడిగాలులు ఉన్నట్లు తెలుస్తోంది. మరో రెండు మూడురోజులు ఇలాంటి వాతావరణమే కొనసాగే అవకాశం ఉంది.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

ఈసాలతక్కళ్లపల్లి	45.0
పాలితం, మల్యాలపల్లి	44.7
ఓదెల, శ్రీరాంపూర్	44.3
భోజన్నపేట, సుగ్లాంపల్లి	43.7
కునారం	43.5
కల్వచర్ల	42.5
కమాన్‌పూర్	42.4
మంథని	42.2

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్



పాదయాత్ర చేస్తున్న మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం యైటింక్లయిన్ కాలనీ 17వ డివిజన్‌లో పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో నిరుపేదలు నష్టపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే నిరుద్యోగ భృతి, పేదలందరికీ ఇళ్లు, ఇంట్లో ఇద్దరికి పింఛన్ ఇప్పిస్తామని పేర్కొన్నారు. వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు తప్ప ఇప్పటివరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, చక్రపాణి, రాజేశం, తిరుపతి, రాజు, నరేష్, కిషన్ నాయక్, తిరుపతి రెడ్డి, మార్కండేయ, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

- హాజరుకానున్న 6,341 కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులు
- సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్, ఎస్సై క్వాలిఫై అయిన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈనెల 14 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో రావాలని, మహిళలు ఉదయం 8 గంటలకు, పురుషులు ఉదయం 9 గంటలకు కమిషనరేట్‌కు చేరుకోవాలని సూచించారు. మొత్తంగా 6,341 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు అందుబాటులో లేకుంటే వారి స్వీయ ధృవీకరణ పత్రంతో కుటుంబసభ్యులు హాజరుకావచ్చన్నారు. టీఎస్ పోలీస్‌కానిస్టేబుల్, ఎస్సై సర్టిఫికేషన్ వెరిఫికేషన్2023 అప్లికేషన్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు (ఒరిజినల్స్) వెంట తెచ్చుకోవాలని సూచించారు.

సకాలంలో హాజరు కావాలి

అభ్యర్థులు తమకు కేటాయించిన సమయాల్లో హాజరు కావాలి. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి. వెరిఫికేషన్ కోసం వచ్చే అభ్యర్థులకు అన్ని ఏర్పాటు చేశాం. – రెమా రాజేశ్వరి, సీపీ

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



జిల్లాకేంద్రంలో మహిళలకు ప్రశంసపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్న ఆలోచనతో సీఎం కేసీఆర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు వర్తింపజేశారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి 91మహిళా సంఘాలకు రూ.7.75కోట్ల చెక్కులు అందించారు. పోలీసు నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. బాలికలు ఉన్నత చదువులకు రెసిడెన్షియల్ వసతి కల్పించిందని అడిషనల్ కలెక్టర్ అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, డీఆర్‌డీఓ శ్రీధర్, సంక్షేమాధికారి రవుఫ్‌ఖాన్, ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సింహాచారి, రంగారెడ్డి తదితరులున్నారు.

నాడు.. నేడు బేరీజు వేసుకోవాలి

మంథని: మహిళల అభివృద్ధికి గత ప్రభుత్వాల పనితీరు.. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను బేరీజు వేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలోని ఎస్‌ఎల్‌బీ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో కలెక్టర్ సంగీత, జయశంకర్‌భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణీతో కలిసి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహిళలకు ప్రతి దశలో సర్కారు సహాయం అందిస్తోందన్నారు. ముందుగా జెడ్పీ చైర్మన్లు, కలెక్టర్‌కు మహిళలు బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, సీడీపీవో పద్మశ్రీ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మంథనిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న మధు, సంగీత



గోదావరిఖనిలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

మహిళల సంక్షేమానికి పెద్దపీట

గోదావరిఖని: మహిళల సంక్షేమానికి సీఎం పెద్దపీట వేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దుర్గానగర్ ఆర్కే గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ మహిళ దినోత్సవంలో పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ 40 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. వీహబ్ ద్వారా 64 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.4కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించామన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, జెడ్పీటీసీ అముల నారాయణ, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, సీడీపీఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఎన్నికల సైరన్

- ఆగస్టులో గుర్తింపు ఎన్నికలు
- నాలుగేళ్ల కాలపరిమితితో ఎన్నికలు?
- కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ తర్వాత షెడ్యూల్
- ఈనెల 24న మరోసారి కార్మిక సంఘాల సమావేశం

సింగరేణిలో నిర్వహించిన ఎన్నికలు, గెలుపొందిన యూనియన్ ఇలా..

ఏడాది	గెలిచిన యూనియన్
09-09-1998	ఏఐటీయూసీ
19-02-2001	ఏఐటీయూసీ
14-05-2003	ఐఎన్‌టీయూసీ
09-08-2007	ఏఐటీయూసీ
28-06-2012	టీబీజీకేఎస్
05-10-2017	టీబీజీకేఎస్
2023 ఆగస్టు	---



గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సైరన్ త్వరలోనే మోగనుంది. నాలుగేళ్ల ఆలస్యమైన ఎన్నికలకు ఆగస్టులో ముహూర్తం రానుంది. వాస్తవానికి 2019 సెప్టెంబర్‌లో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడొద్దనే ఉద్దేశంతోనే వర్షాకాలంలో ఎన్నికలకు యాజమాన్యం అంగీకరించింది. ఆగస్టు 3లేదా 10న ఎన్నికలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎల్‌సీ సూత్రప్రాయంగా వెల్లడించడంతో ఏదో ఒక తేదీ ఖరారు కానుంది.

ఎన్నికలతో పెనుమార్పులు..

సింగరేణి సంస్థలో గుర్తింపు ఎన్నికల ప్రక్రియతో పెనుమార్పులు సంభవించాయి. రాష్ట్రంలోని పార్టీలకు సింగరేణి ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం అయ్యాయి. సింగరేణి విస్తరించి ఉన్న ఏడు జిల్లాల్లో గుర్తింపు ఎన్నికలు అన్ని పార్టీలకు కీలకంగా మారనున్నాయి. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో సుమారు 39వేల మంది కార్మికులు పనిచేస్తుండగా.. ప్రధానంగా ఆరు కార్మిక సంఘాలు పోటీకి ఉండనున్నాయి. సింగరేణిలో సమ్మెలు నివారించాలనే లక్ష్యంతో 1998లో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ మొదట రెండేళ్ల కాలపరిమితితో నిర్వహించారు. ఆ తర్వాత నాలుగేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే కోవిడ్ నేపథ్యంలో గుర్తింపు ఎన్నికలు ఆలస్యమయ్యాయి. కోవిడ్ తగ్గిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని జాతీయ కార్మిక సంఘాలు కోరినప్పటికీ కరోనా కారణంతో సింగరేణి జిల్లాల కలెక్టర్లు, యాజమాన్యం ఆసక్తి చూపించలేదు. సింగరేణిలో ఎన్నికలతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ 3రోజుల సమ్మెకు పిలుపునిచ్చింది. ఇదే సమయంలో టీబీజీకేఎస్ యూనియన్ కూడా జేఏసీతో కలిసి సమ్మె చేసింది. దీంతో సింగరేణిలో మూడు రోజుల సమ్మె విజయవంతం అయ్యింది. దీనిపై చర్చలకు ఆహ్వానించిన సమయంలో సింగరేణిలో సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ఆర్‌ఎల్‌సీ సమక్షంలో అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మార్చిలో బొగ్గు ఉత్పత్తి కీలకం కావడంతో ఎన్నికలకు యాజమాన్యం సానుకూలంగా స్పందించలేదు. దీంతో గతేడాది ఏఐటీయూసీ హైకోర్టుకు వెళ్లింది. డిసెంబర్ నుంచి మూడునెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినా.. ఫిబ్రవరిలో సింగరేణి యాజమాన్యం బొగ్గుకు డిమాండ్ ఉన్న సమయంలో ఎన్నికలకు ఒప్పుకోలేదు. మరో మూడు నెలల గడువు కావడంతో జూన్‌లో ప్రక్రియ ప్రారంభమైంది.

రాజకీయ పార్టీలకు కీలకం..

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు కీలకంగా మారనున్నాయి. రాష్ట్రంలోని ఏడు జిల్లాలో సింగరేణి సంస్థ విస్తరించి ఉంది. ప్రస్తుతం సంస్థలో సుమారు 39వేల మంది కార్మికులు ఉన్నారు. వారికి అనుబంధంగా మరో లక్షకుపైగా ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సాధించిన యూనియన్ అనుబంధ పార్టీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కార్మికుల మద్దతు లభించే అవకాశం ఉంది.

ఈసారి 39వేల మంది ఓటర్లు

సింగరేణి వ్యాప్తంగా విస్తరించి ఉన్న 11ఏరియాల్లో ఈసారి ఓటు హక్కు వినియోగించుకునే కార్మికులు 39వేల మంది ఉన్నారు. సంస్థ మొత్తంలో 42వేల మంది మంది పనిచేస్తుండగా.. అధికారులు పోను 39వేల మందికి ఓటు హక్కు ఉండనుంది. 15వేల పైచిలుకు ఓట్లు లభించిన యూనియన్ గుర్తింపు సంఘంగా గెలిచే అవకాశం ఉంది. టీబీజీకేఎస్, జాతీయ కార్మిక సంఘాలుగా ఉన్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూతో పలు విప్లవ కార్మిక సంఘాలు పోటీలో నిలవనున్నాయి. వీటిలో ప్రధానంగా టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ మధ్య పోటీ ఉండే అవకాశాలున్నాయి.

క్లుప్తంగా

టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడిగా శశిభూషణ్ కాచే


శశిభూషణ్ కాచే

మంథని: టీపీసీసీ ఎన్నికల కమిషన్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా మంథనికి చెందిన న్యాయవాది శశిభూషణ్ కాచేను రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నియమించారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన ఈ కమిటీ పని చేయనుంది. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ శశిభూషణ్ కాచేకు నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబుకు కాచే కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సునీల్ రెడ్డి


సునీల్‌రెడ్డి

మంథని: బీజేపీ నూతన కార్యవర్గంలో మంథనికి చెందిన చంద్రుపట్ల సునీల్‌రెడ్డికి చోటు కల్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ పదవికి న్యాయం చేస్తానని సునీల్‌రెడ్డి తెలిపారు.

'సర్పంచుపై అనర్హత వేటు వేయండి'


కలెక్టరేట్ ఏవో ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న రాఘవాపూర్‌వాసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ సర్పంచు ఆడెపు వెంకటేశంకు ముగ్గురు సంతానం ఉన్నందున ఆయనపై అనర్హత వేటు వేయాలని గ్రామానికి చెందిన తాడిచెట్టి శ్రీకాంత్ తదితరులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఏవో ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ముగ్గురు సంతానం ఉన్నట్లు బర్త్ సర్టిఫికెట్లను ఫిర్యాదు కాపీకి జతచేసి, అందించామని తెలిపారు. సర్పంచుపై ఫిర్యాదు అందిందని, సంబంధిత పత్రాన్ని కలెక్టర్ ఆఫీసుకు పంపించామని, నిబంధనల ప్రకారం చర్యలుంటాయని ఏవో తెలిపారు. గ్రామస్తులు సదయ్య, రాజ్‌కుమార్, సంతోష్ తదితరులున్నారు.

వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ ఉచిత శిక్షణ

గోదావరిఖని(రామగుండం): వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీ–1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ప్రభావిత, పరిసర గ్రామాల ప్రజలు, మాజీ ఉద్యోగుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీపీలో పని చేస్తున్న ఆఫ్ లోడింగ్ ఏజెన్సీలలో ఉపాధి అవకాశాలను సృష్టించడానికి మూడు నెలకోసారి 50 మందితో కూడిన బ్యాచ్‌కు ప్రాథమిక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతిలో మెరిట్ ఆధారంగా 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయో పరిమితిలో సడలింపు ఉంటుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాత కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అన్ని అర్హతలు, ఆసక్తి గలవారు ఈ నెల 15వ తేదీలోగా ఆర్జీ–1 జీవీటీసీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రక్తమిద్దాం.. ప్రాణం నిలుపుదాం



- ఒక యూనిట్ రక్తంతో నలుగురికి ప్రాణం పోయొచ్చు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

జగిత్యాల/సిరిసిల్లటౌన్/కోల్‌సిటీ(రామగుండం)/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/పెద్దపల్లిరూరల్: దాత ఇచ్చిన ఒక యూనిట్ రక్తం నలుగురికి ప్రాణం పోస్తుంది. రక్తదానం బాధితులకు, దాతలకు మధ్య బంధాలను ఏర్పాటు చేస్తుంది. అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యానికి గురైనప్పుడు రక్తం అవసరం ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు దాతలు ఒక్క ఫోన్‌కాల్‌తో స్పందించి, రక్తదానం చేస్తున్నారు. యువతలో దీనిపై అవగాహన వచ్చింది. వాట్సాప్ గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉంటూ ఎవరికి రక్తం అవసరమైనా వెళ్లి, ఇస్తున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే జీవ శాస్త్రవేత్త మానవ రక్తకణాలను కనుగొన్నందుకు గాను వైద్య శాస్త్రంలో 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి గుర్తింపుగా రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా కథనం.


కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు

35 రోజులు భద్రపరచవచ్చు

ఒక మనిషి నుంచి రక్తాన్ని సేకరించి, 35 రోజుల వరకు భద్రపరచవచ్చు. ఆ తర్వాత అది పని చేయదు. కాగా, నాలుగు రకాల బ్యాగులను ఉపయోగించి, రక్తాన్ని సేకరించాల్సి ఉంటుంది. అనంతరం దాన్ని సింగిల్, డబుల్, ట్రిపుల్, క్వాడ్రిపుల్ బ్యాగులుగా విభజించి, భద్రపరుస్తుంటారు. అప్పుడు దాదాపు 120 రోజుల వరకు నిలువ చేయడానికి ఆస్కారం ఉంటుందని రక్తనిధి ప్రతినిధులు తెలిపారు.

వీరు రక్తదానం చేయొచ్చు

- 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు, 45 కిలోల ఎక్కువ బరువుండి, రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ కంటే ఎక్కువ ఉన్నవారెవరైనా రక్తదానం చేయవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.
- హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్–బి, సి, బ్లడ్ కేన్సర్, హైబీపీ, క్షయ, మూర్ఛ, మత్తు పదార్థాలకు బానిసలైన వారు రక్తదానం చేయడానికి అనర్హులు. టాటూ వేసుకున్నవారు కూడా చేయొద్దు.
- రక్తదానం చేసి, 90 రోజులు దాటినవారు మళ్లీ చేయొచ్చు.

2 వేల మందితో వాట్సాప్ గ్రూప్



కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మంచికట్ల శ్రీనివాస్ 2 వేల మంది రక్తదాతలతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్నవాళ్లకు సకాలంలో రక్తదానం చేయించి, ఆదుకుంటున్నాడు. 2012లో స్నేహితులతో కలిసి స్పందన యువసేన అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇప్పటివరకు 17 సార్లు రక్తదానం చేశా.

సిరిసిల్ల బ్లడ్‌బ్యాంకులో వసతులు

రాజన్నసిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తదాతల కోసం మంత్రి కేటీఆర్ సహకారంతో సకల వసతులు కల్పించారు. అన్ని రోజుల్లో దాతల నుంచి రక్తం సేకరిస్తున్నారు. ఈ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఇప్పటివరకు 112 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటిల్లో 6,774 మంది దాతలు రక్తదానం చేశారు. జిల్లాలోని రెడ్‌క్రాస్, రెడ్‌డ్రాప్, లయన్స్ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లాలో..

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఎన్టీపీసీలోని ధన్వంతరి ఆస్పత్రిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ తెలిపారు.

జగిత్యాల జిల్లాలో శిబిరాలు

జగిత్యాల జిల్లాలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకటి, ప్రైవేటుగా నాలుగు(జగిత్యాలలో 3, మెట్‌పల్లిలో 1) రక్తనిధి కేంద్రాలున్నాయి. సర్కారు దవాఖానాలో ఉచితంగానే పేషెంట్స్‌కు అత్యవసరంగా రక్తం అందజేస్తారు. అంతేకాకుండా ఇక్కడి నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి ఆస్పత్రులకు సైతం పంపిస్తుంటారు.

నేడు రాజ్‌భవన్‌లో 54వ సారి..


రక్తదానం చేస్తున్న రాజయ్య

పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన కొండేటి రాజయ్య ఇప్పటివరకు 53 సార్లు రక్తదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో 54వ సారి రక్తదానం చేయనున్నట్లు తెలిపారు. అక్కడే గవర్నర్ తమిళిసై చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

3 వేల యూనిట్లు చేయించా



నేను పదేళ్లలో 48 సార్లు ప్లేట్‌లెట్స్, రక్తదానం చేశా. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఫోన్ చేస్తే స్పందిస్తున్న. మా మిత్రులతో ఇప్పటివరకు 3 వేల యూనిట్లు రక్తదానం చేయించాను. సినీహీరో చిరంజీవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న.

– గాలిపెల్లి కుమార్, బొమ్మకల్, కరీంనగర్

రక్తనిధికి పంపిస్తున్నం



సిరిసిల్ల పట్టణానికి చెందిన మా స్నేహితులతో కలిసి రెడ్ డ్రాప్ అనే సామాజిక సేవా సంస్థను నడిపిస్తున్నాం. ఇప్పటివరకు వందల మంది సభ్యులతో వేలాది మందికి రక్తదానం చేయించాం. రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని రక్తనిధి కేంద్రానికి పంపిస్తున్నం. రక్తం అవసరమున్నవారు 98859 75566 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

– అస్లాం, రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ప్రతినిధి, సిరిసిల్ల

ఎంతోమందిని కాపాడిన



అత్యవసర సమయాల్లో బాధితులకు రక్తదానం చేయాలి. నేను ఇప్పటివరకు 63 సార్లు చేసి, ఎంతోమంది ప్రాణాలు కాపాడిన. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న.

– తుమ్మనపల్లి బాలకృష్ణ, జగిత్యాల

ఆరోగ్యంగా ఉంటాం



రక్తదానం చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటామన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. రక్తదానం చేస్తే ఇతరులకు సాయం చేశామన్న సంతృప్తి ఉంటుంది. యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– కావేటి రాజ్‌గోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్, పెద్దపల్లి

అపోహలు, భయం వద్దు



రక్తదానం చేయడంలో అపోహలు, భయం వద్దు. 20 నుంచి 60 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులు, ప్రతీ మూడు నెలలకోసారి రక్తం ఇవ్వవచ్చు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ బి.అమూల్ కుమార్, పాథాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గోదావరిఖని

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్

- డీఏవో ఆదిరెడ్డి


తనిఖీ చేస్తున్న ఏవో ప్రత్యూష

సుల్తానాబాద్(పెద్దపల్లి): నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని డీఏవో ఆదిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినా, అధిక ధర తీసుకున్నా కఠినచర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచే విత్తనాలను కొనుగోలు చేసి, అమ్మాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డేవిడ్ రాజు తదితరులున్నారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

పెద్దపల్లిరూరల్: విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని డీఏవో ఆదిరెడ్డి హెచ్చరించారు. పెద్దపల్లిలో మంగళవారం విత్తన డీలర్లతో సమావేశమై, పలు సూచనలు చేశారు. విత్తనాలు కొనే రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి అలివేణి తదితరులున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు

జూలపల్లి(పెద్దపల్లి): విత్తనాలు, క్రిమిసంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జూలపల్లి మండల వ్యవసాయాధికారి ప్రత్యూష హెచ్చరించారు. పత్తి విత్తనాలు ఎక్కువ ధరలకు విక్రస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మంగళవారం ఆమె పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డులు, విత్తన ప్యాకెట్లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులివ్వాలని, నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామన్నారు.

సింగరేణి కమ్యూనిటీ హాల్‌కు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలోని మహాకవి పోతనకాలనీలో సింగరేణి కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు జీఎం మనోహర్ మంగళవారం స్థల పరిశీలన చేశారు. త్వరలో భూమిపూజ చేసి, పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, సివిల్ డీజీఎం ధనుంజయ్, పర్సనల్ డీజీఎం రాజేంద్ర ప్రసాద్, ఎస్ఎస్‌వో రమణ తదితరులున్నారు.

కన్వేయన్స్ వాహనాలకు రోడ్లు వేయాలి

- సింగరేణి డైరెక్టర్ల ఆదేశం


మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం, అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఓసీపీల్లోని హాలేజీ రోడ్లలో ప్రమాదాలు జరగకుండా కన్వేయన్స్ వాహనాలకు ప్రత్యేక రోడ్లు వేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం అన్ని ఏరియాల జీఎంలు, సేఫ్టీ అధికారులు, ప్రాజెక్టు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. డీఎంఎస్ ఆదేశాల ప్రకారం భారీ వాహనాలు తిరిగే హాలేజీ రోడ్ల వెంట కన్వేయన్స్ వాహనాల ప్రయాణం ఉండకుండా చూడాలన్నారు. దీనికోసం అన్ని ఓసీపీల్లో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి బండి సత్యనారాయణ, ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, డీజీఎం సేఫ్టీ అశోక్‌కుమార్, సివిల్ డీజీఎం నవీన్ తదితరులున్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి



ర్యాలీ తీస్తున్న నాయకులు, జేడ్పీటీసీ, కార్మికులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం జాప్యం కావడంతో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాజెక్టు గేట్ నుంచి ర్యాలీగా పరిపాలనా భవనం గేట్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి మాట్లాడారు. యాజమాన్యం మొండి వైఖరిని వీడి, కార్మికుల సంక్షేమం కోసం వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ధర్నా

- సమస్యల పరిష్కారానికి డైరెక్టర్(పా) బలరాం హామీ


డైరెక్టర్(పా)కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట సింగరేణి కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. గుర్తింపు ఎన్నికల సమావేశ సమయంలో ఇది చర్చనీయాశమైంది. కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని, 2022 సెప్టెంబర్ 26న చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలని కోరుతూ మూడు గంటలపాటు నిరసన తెలిపారు. అనంతరం డైరెక్టర్(పా) బలరాంకు వినతి పత్రం అందజేశారు. సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సింగరేణి కాంటాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, ఉపాధ్యక్షులు కంపేటి రాజయ్య, నాయకులు ఎ.ఓదెలు, వి.కుమారి, అరవింద్, బాణయ్య, సుధాకర్, సారయ్య, లక్ష్మి, శంకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఏఎన్ఎం మృతి


సునీత (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మంగపేట సెకండ్ ఏఎన్ఎం చిలుకలపల్లి సునీత(42) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి భర్త మల్లయ్య, కూతురు, కుమారుడు ఉన్నారు. సునీత మృతదేహానికి సర్పంచు మంగ, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది నివాళి అర్పించారు.

ధాన్యం అమ్ముకుంటున్న లారీ డ్రైవర్ పట్టివేత

- కునారంలో ఘటన
- న్యాయం చేయాలని కోరుతున్న రైతులు


పట్టుబడిన ధాన్యం లారీ

పెద్దపల్లిరూరల్: రైతు పలు రకాలుగా మోసపోతూ.. నష్టపోతూనే ఉన్నాడు. కొనుగోలు కేంద్రంలో తూకంలో, మిల్లు వద్ద మిల్లర్ల చేతిలో మోసం చాలదన్నట్లు ధాన్యాన్ని మిల్లుకు మోసుకెళ్లే లారీ డ్రైవర్ కూడా మార్గమధ్యలో వాహనం ఆపి, ట్రిప్పునకు పది, ఇరవై బస్తాల ధాన్యాన్ని అమ్ముకుంటూ మంగళవారం పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామానికి చెందిన గీట్ల గుణాకర్‌రెడ్డి, ఇతర రైతులు తాము పండించిన ధాన్యాన్ని మంగళవారం స్థానిక కొనుగోలు కేంద్రంలోనే విక్రయించారు. అనంతరం లారీలో పెద్దపల్లి శివారులోని భవాని రైస్‌మిల్లుకు తరలించారు. మార్గమధ్యలో డ్రైవర్ లారీని ఆపి, మోపెడ్‌లపై సిద్ధంగా ఉన్న తన అనుచరులకు ధాన్యం బస్తాలను అప్పగిస్తున్నాడు. కూనారానికి చెందిన నారగోని లక్ష్మణ్ గమనించి, పట్టుకున్నాడు. మిగతా రైతులకు సమాచారం అందించి లారీని మిల్లుకు తరలించాడు. ఇప్పటివరకు ఇదే లారీలో రవాణా చేసిన ధాన్యాన్ని తూకం వేస్తే తరచూ తక్కువగా వస్తోందని అనుమానించినా.. ఆధారాలు లేకపోవడంతో మిన్నకుండిపోయారు. ఈ లారీలో 27 ట్రిప్పుల ధాన్యాన్ని తరలించామని ఐకేపీ ఏపీఎం కనకయ్య తెలిపారు. నిర్వాహకుల ద్వారా లెక్కతేల్చి, తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.